www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 9 జూన్ 2024

అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌కు నిహారిక ఎంపిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణానికి చెందిన కారుమూరి నిహారిక అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌కు ఎంపికైంది. కోచ్ బికె..రత్నం ఆధ్వర్యంలో శనివారం ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రత్నం మాట్లాడుతూ ఇటీవల మహారాష్ట్ర లోని పూణేలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్ లో నిహారిక ఉత్తమ ప్రతిభ కనబరిచి రెండు గోల్డ్ మెడల్స్ సాధించి విన్నర్‌గా నిలిచిందన్నారు. ప్రతిభ కనబర్చిన నిహారికను ప్రభుత్వపరంగా ప్రోత్సహించి, సహకరించాలని కోరారు. ఈ సన్మాన కార్యక్రమంలో పట్టణానికి చెందిన పలువురు పాల్గొని నిహారికను అభినందించారు.

కిక్ బాక్సర్ నిహారికకు సన్మానం

అనుమతుల్లేని ఆర్‌ఓ ప్లాంట్లు

- శుద్ధి చేయని తాగునీటి విక్రయాలు
- యథేచ్ఛగా అమ్మకాలు
- అధికారుల నామమాత్రపు తనిఖీలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

మానవ జీవితంలో నీరు అతి ముఖ్యమైన వనరు. అందుకే శుద్ధ జలాల కోసం ప్రజలు ఎంతైనా ఖర్చు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో కొళాయిల ద్వారా వస్తున్న నీటిని తాగలేని అనేకమంది ప్రజలు ఆర్వో ప్లాంట్ల నీటిపైనే ఆధారపడుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో పేదలు సైతం ప్లాంట్ల వద్దకు వెళ్లి రూ.5 నుంచి రూ.10 ఇచ్చి బిందె నీరు కొని తెచ్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అనుమతి లేకుండానే వేలాది ఆర్‌ఓ ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. దీంతో తాగునీటి వ్యాపారం యథేచ్ఛగా సాగిపోతోంది. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా అనేక మినరల్ వాటర్ ప్లాంట్లు వెలిశాయి. ప్రభుత్వ అనుమతి లేకుండానే ప్లాంట్ల నిర్వాహకులు జోరుగా నీటి వ్యాపారం సాగిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం నగరాలతో బాటు తుని, పిఠాపురం, పెద్దాపురం, సామర్లకోట, మండపేట, రామచంద్రాపురం, అమలాపురం పట్టణ, పరిసర ప్రాంతాల్లోనే కాక ఇతర అన్ని మండల కేంద్రాలు, పలు పంచాయతీల పరిధిలో చిన్నా పెద్దా కలిపి అనధికారికంగా వందలకొలదీ ప్లాంట్లు నడుస్తున్నాయి. మూడు జిల్లాల్లో ఇలాంటివి సుమారుగా 4 వేలకు పైగానే ఉన్నాయని అంచనా. ఇళ్ళల్లోని బోర్లు, బావుల నుంచి నీటిని ట్యాంకుల్లోకి నింపి, శుద్ధి చేయకుండానే రుచి కోసం కొంచెం రసాయనాలు కలిపి విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

వ్యాపారం రూ.కోట్లలో...

20 లీటర్ల క్యాన్‌కు రూ.15 నుంచి రూ.20 వసూలు చేస్తున్నారు. ఒక్కో ప్లాంటు నుంచి రోజుకు సుమారు 100 క్యాన్ల వరకు అమ్ముతున్నారు. ఇలా మూడు జిల్లాల్లో అనధికారికంగా రోజుకు సుమారు 80 లక్షల లీటర్ల నీరు సరఫరా చేస్తున్నారు. అంటే రోజూ రూ.80 లక్షలు చొప్పున నెలకు రూ.24 కోట్ల పైనే నీటి వ్యాపారం చేస్తున్నారు. ఫ్లోరైడ్, కలుషిత నీటిపై ప్రజల్లో అవగాహన పెరగడంతో శుద్ధి నీటి కోసం పరుగులు పెడుతున్నారు. బోర్లు, రక్షిత పథకాల నుంచి వస్తున్న నీటిని ఇతర అవసరాలకు ఉపయోగిస్తూ తాగునీటి కోసం మినరల్ వాటర్ క్యాన్లు కొనుగోలు చేస్తున్నారు. ఇందు కోసం ఒక్కో కుటుంబం నెలకు రూ.400 నుంచి రూ.600 వరకు ఖర్చు చేస్తోంది. పెళ్లిళ్లు, విందులకు ప్లాంట్ల నిర్వాహకులు ఏకంగా డ్రమ్ములతో సరఫరా చేస్తూ భారీగా డబ్బు వసూలు చేస్తున్నారు. వేసవిలో దందా ఎక్కువగా ఉంటుంది.

నిబంధనలకు నీళ్లు

నీటిలో స్వచ్ఛతను కొలిచేందుకు టిడిఎస్ (టోటల్ డిజాల్వ్‌డ్ సాలిడ్స్)ను ప్రామాణికంగా తీసుకుంటారు. నీటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం, సోడియం, బైకార్బొనేట్స్, క్లోరైడ్స్, సల్ఫేట్స్ కరిగి ఉంటాయి. టిడిఎస్ పిపిఎం (పెలాటబిలిటీ కోషెంట్ మిలియన్) స్థాయి 1000 దాటితే ఆ నీరు విషతుల్యం అవుతుంది. ఈ నీరు తాగితే మూత్ర పిండాలు పాడవుతాయి. జీర్ణవ్యవస్థ దిబ్బతింటుంది. ప్రాణాపాయం కలిగేంత అనారోగ్య పరిస్థితులు తలెత్తుతాయని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. మున్సిపాలిటీ పరిధిలో ఏర్పాటైన నీటి శుద్ధి కేంద్రాల నుంచి నమూనాలు సేకరించి, నాణ్యత ప్రమాణాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉంది. ప్రతి ప్లాంట్‌లో బ్యూరో ఆఫ్ ఇండియా స్టాండర్డ్ (బిఐఎస్) ప్రమాణాలు పాటించాలి. ఎస్‌ఎస్‌ఐ, ఐఎస్‌ఐ రిజిస్ట్రేషన్లతోపాటు కాలుష్య నియంత్రణ, ట్రేడ్ మార్క్ రిజిస్ట్రేషన్ వంటి 14 మార్గదర్శకాలు పాటించాల్సి ఉంటుంది. ప్లాంటు వద్ద అర్హత గల ల్యాబ్ టెక్నీషియన్లను నియమించాలి. అనేక మంది నిర్వాహకులు ఇవేమీ పాటించడం లేదు.

పర్యవేక్షణ శూన్యం

ప్యూరిఫైడ్ నీటి పేరుతో మోసం చేస్తున్న ప్రైవేటు జల కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీ చేయాల్సి ఉంటుంది. పంచాయతీ పరిధిలో అయితే పిహెచ్‌సి వైద్యులు, ఆహార తనిఖీ అధికారి, ఎంపిడిఒలు తనిఖీ చేయొచ్చు. నగరపాలక సంస్థ పరిధిలో ఆర్‌డబ్ల్యుఎస్, టాస్క్ ఫోర్స్ అధికారులు పరిశీలించాలి. ఆయా శాఖల మధ్య సమన్వయం లేకపోవడం, సిబ్బంది మామూళ్లకు అలవాటు పడడంతో ప్లాంట్ల వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఫ్లాగ్ మార్చ్‌లో మాట్లాడుతున్న కె.గంగవరం ఎస్ఐ జానీబాషా

గ్రామాల్లో దాడులకు పాల్పడితే ఉపేక్షించం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఎన్నికలు ముగిసిన అనంతరం కె.గంగవరం మండలంలోని పలు గ్రామాల్లో కవ్వింపు చర్యలు, దాడులకు తెగబడుతున్నారని అటువంటివారిని ఉపేక్షించేది లేదని కె.గంగవరం ఎస్ఐ జానీ బాషా తెలిపారు. కె.గంగవరం పోలీస్ స్టేషన్ పరిధిలో పలు గ్రామాల్లో శనివారం పారా మిలటరీ దళాలతో కవాతు నిర్వహించారు. ప్రస్తుత కాలంలో ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటినుండి కొన్ని పార్టీల వ్యక్తులు కవ్వింపు చర్యలకు తెగబడుతున్నారని, ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారని ఇటువంటి కార్యక్రమాలు పాల్పడినవారు ఎంతటి వారైనా చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటన జరగకుండా కె.గంగవరం మండలంలో స్పెషల్ ఫోర్స్‌తో కలసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సామాన్య ప్రజలకు, శాంతిభద్రతలకు విఘాతం కలగజేస్తే కఠిన చర్యలు తప్పవని, వారి పై కేసులు నమోదు చేసి, కోర్టుకు పంపిస్తామని హెచ్చరించారు. ఎన్నికల మొదటి నుంచి ఫలితాల వరకు శాంతియుతంగా ఉన్న కె.గంగవరం మండల ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే ఎవరికైనా శిక్ష తప్పదని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

ఆత్మగౌరవ కవాతు సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

కొమరగిరి జాంబవన్ పేటలో జిల్లా మాదిగ ఆత్మగౌరవం కవాతు సన్నాహక సమావేశం జిల్లా ఎమ్ఆర్‌పిఎస్ సవరపు భైరవమూర్తి అధ్యక్షతన సమావేశం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా మహాజన సోషలిస్ట్ పార్టీ ఉపాధ్యక్షులు వీధి చిరంజీవి మాట్లాడుతూ జూలై 7న వరంగల్‌లో నిర్వహించనున్న ఎమ్ఆర్‌పిఎస్ 30 సంవత్సరాల ఆవిర్భావదినోత్సవంలో భాగంగా మాదిగల ఆత్మగౌరవ కవాతు నిర్వహిస్తారన్నారు. మన జిల్లాలో అన్ని గ్రామాల నుంచి 25 మంది తక్కువ కాకుండా వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎంఎస్‌పి నాయకులు పలివెల మోహనరావు, కందవల్లి ఏలియా, ఐ.పోలవరం మండల ఎమ్ఆర్‌పిఎస్ అధ్యక్షులు ఉందుర్తి విజయ్ కిషోర్ బాబు, మండలం ఉపాధ్యక్షులు ముమ్మిడివరం మన్యం, ఉందుర్తి ప్రకాష్, సవరపు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణ మాసోత్సవంపై అవగాహన

ప్రజాశక్తి-అయినవిల్లి

అయినవిల్లి మండలంలోని వీరవల్లిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బొమ్మరాలతిప్ప గ్రామం లో శనివారం మలేరియా నివారణ మాసోత్సవంపై పిహెచ్ సి ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ టి.విజయ్ మలేరియా వ్యాధి వ్యాప్తి, నివారణ, దోమల వ్యాప్తి అరికట్టుట, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ముందస్తు చర్యలు, ఫ్రై డే - డ్రై డే ఆవశ్యకత తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమం అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు

టిడిపి నేత సత్తిబాబుకు అభినందన

ప్రజాశక్తి-ఆలమూరు

కొత్తపేట ఎంఎల్ఎ బండారు సత్యానంద రావును విజయానికి కృషి చేసిన టిడిపి జిల్లా అధికార ప్రతినిధి ఈదల సత్తిబాబును శనివారం చెముడులంక టిడిపి నాయకులు కలిసి అభినందించారు. ఆయనను మండల కేంద్రంలో టిడిపి కార్యాలయం వద్దకు ఆహ్వానించి సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మండల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటరత్నం, టిడిపి నేతలు నాగిరెడ్డి సత్యానందం, కొత్తపల్లి రాంబాబు, సిరంగుల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

సత్తిబాబును సత్కరించిన చెముడులంక నేతలు

ఉన్నతాధికారి నుంచి ఎంఎల్ఎగా 'గిడ్డి'

ప్రజాశక్తి - మామిడికుదురు

జనసేన పి.గన్నవరం నియోజకవర్గ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ తొలి ప్రయత్నంలోనే చరిత్ర తిరగ రాశారు. పి.గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యునిగా 33,367 ఓట్ల మెజారిటీతో తొలిసారిగా విజయ ఢంకా మోగించారు. 2009లో నగరం నియోజకవర్గం నుంచి పి.గన్నవరం నియోజకవర్గంగా ఏర్పడింది. ఇప్పటి వరకూ మూడు సార్లు ఎన్నికలు జరిగాయి. అలా వచ్చి ఇలా టిక్కెట్ సాధించి రెండు నెలల వ్యవధిలో ప్రజల ఆదరాభిమానాలతో ఆశ్చర్యకరమైన మెజారిటీతో గిడ్డి సత్యనారాయణ గెలుపొందడం విశేషం. ఎన్నికల్లో కూటమి బలపరిచిన పి.గన్నవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఎంఎల్ఎ అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ వైసిపి అభ్యర్థి విప్పర్తి వేణు గోపాల్‌పై 33,367 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. గిడ్డి సత్యనారాయణకు 96,108 ఓట్లు రాగా, వేణుగోపాల్‌కు 62,741 ఓట్లు వచ్చాయి.

గిడ్డికి శుభాకాంక్షలుచెబుతున్న మామిడికుదురు జనసేన నేతలు

గిడ్డికి శుభాకాంక్షలుచెబుతున్న అంబాజీపేట టిడిపి శ్రేణులు

ఉన్నతాధికారి హోదాతో ప్రజల ఆదరణ

గిడ్డి సత్యనారాయణ లంకవాసిగా, లా అండ్ ఆర్డ్‌పై అవగాహన ఉన్న వ్యక్తి. వరదల సమయంలో లంక గ్రామాలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్న వ్యక్తిగా ప్రజల్లో ఉన్న ఆదరణ అత్యధిక మెజారిటీ సాధించిందని చెప్పవచ్చు.

ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకూ జరిగిన అక్రమ ఇసుక, మట్టి రవాణా, దానికి తోడు చట్టాన్ని గత ప్రభుతాల్లో అధికార పార్టీ నేతలు చేతుల్లోకి తీసుకున్నారు. వారికి ఎదురు తిరిగిన వారిని అణగ దొక్కే ధోరణి, ద్వితీయ శ్రేణి నాయకులు కొందరు రెండవ ఎంఎల్ఎగా చలామణి అయ్యి ప్రజావ్యతిరేక కార్యక్రమాలు చేపట్టారని ఆరోపణలు ఉన్నాయి.

నాలుగు మండలాల్లో గిడ్డి ఆధిక్యత

మామిడికుదురు మండలంలో 11, పి.గన్నవరంలో 20, అంబాజీపేటలో 16, అయినవిల్లిలో 21 గ్రామాలతో నియోజక వర్గం విస్తరించి ఉంది. నాలుగు మండలాల్లో మామిడికుదురు మండలంలో 10,159 ఓట్లు, పి.గన్నవరంలో 10,574 ఓట్లు, అంబాజీపేట మండలంలో 7,356 ఓట్లు, అయినవిల్లి మండలంలో 4,643, పోస్టల్ బ్యాలెట్‌లు 635 ఓట్లు మెజార్టీ రావడంతో అందరినీ ఆశ్చర్యపరిచింది.

అభివృద్ధితోపాటు సంక్షేమ పాలన అందిస్తా 'గిడ్డి'

పి.గన్నవరం మండలంలో ఉడిమూడిలో గిడ్డి సత్యనారాయణ జన్మించారు. తాను జన్మించిన ప్రాంతానికి ఏదైనా చేయాలనే ఉద్దేశ్యంతో తెలంగాణలో పోలీస్ శాఖలో ఎఐగా నిర్వహిస్తున్న ఉద్యోగానికి స్వస్తి పలికి రాజకీయ రంగాన్ని ఎంచుకున్నారు. తనకు పొత్తులో భాగంగా జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ పి.గన్నవరం నియోజకవర్గం నుంచి ఎంఎల్ఎగా పోటీచేసే అవకాశం కల్పించారన్నారు. తనను కలవడానికి వచ్చిన మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ అభివృద్ధితో పాటు సంక్షేమ పాలన అందిస్తామన్నారు. తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజారిటీతో ఎంఎల్ఎగా గెలిపించిన ప్రజల నమ్మకాన్ని ఆయన నిలుపుకుంటానన్నారు.

పవన్ కళ్యాణ్‌కు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ

రామోజీ మృతికి పలువురి సంతాపం

ఈనాడు దిన పత్రిక వ్యవస్థాపకుడు రామోజీరావు అకాల మరణం పట్ల శనివారం ప్రముఖులు, వివిధ పార్టీలు నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం: రామోజీరావు మరణం బాధాకరమని సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామోజీరావు మృతికి సంతాపం తెలియజేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు. రామోజీరావు తెలుగు మీడియా రంగానికి నూతన వరవడి దిద్దారని, పత్రికా విలువలు నిలబెట్టడంలో ఆయన కృషి చేశారని అన్నారు. సుందరయ్య, రాజేశ్వరరావు లాంటి నాయకుల్ని ఎంతో అభిమానించేవారని తెలియజేశారు. రామోజీరావు మృతి ప్రజాతంత్ర ఉద్యమానికి లోటన్నారు. సంతాపాన్ని తెలియజేసినవారి సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి.దుర్గ ప్రసాద్, ఎన్.బలరాం, పీతల రామచంద్రరావు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కుడిపూడి రాఘవమ్మ, ఎన్.సూర్యనారాయణ, జిల్లా నాయ కులు తాడి శ్రీరాం మూర్తి పొలమూరి శ్రీనివాసరావు తదితరులున్నారు. **అయినవిల్లి:** రామోజీరావు మృతికి అయినవిల్లి మండలం ఎన్‌డిఎ నాయకులు నివాళి అర్పించారు. ముక్తేశ్వరం అంబేద్కర్ కూడలిలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ అధ్యక్షుడు సిహెచ్. శ్రీనివాస్ ప్రధాన కార్యదర్శి కె. బుజ్జి రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు. **అమలాపురం రూరల్:** అమలాపురం సూర్యానగర్ లో మానవతా కళాప్రాంగణంలో మానవతా సేవాసమితి అధ్యక్షులు ముషిణి రామకృష్ణారావు అధ్యక్షతన రామోజీ రావు ఆకస్మిక మరణం సందర్భంగా ఏర్పాటు చేసిన అత్యవసర సమావేశంలో పలువురు కోనసీమ ప్రముఖులు రామోజీ మరణం పట్ల తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తంచేశారు. రామోజీరావు అకాల మరణం పట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు శనివారం సంతాపం తెలిపారు. **ముమ్మిడివరం:** మంగళగిరి టిడిపి కేంద్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో శనివారం రామోజీ రావు మృతికి నివాళులు అర్పించారు. రామోజీరావు చిత్రపటానికి ముమ్మిడివరం ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పలువురు ఎంఎల్ఎలు మరియు ముమ్మిడివరానికి చెందిన పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. **పి.గన్నవరం:** క్యాంపు కార్యాలయం వద్ద రామోజీరావు చిత్రపటానికి పి.గన్నవరం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణ తదితరులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు. **అంబాజీపేట:** సెంటర్‌లో టిడిపి, జనసేన మండల శాఖ నాయకుల ఆధ్వర్యంలో శనివారం రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉమ్మడి టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** ఈనాడు సంస్థల అధినేత రామోజీ రావు మృతికి మామిడికుదురు మండల ఎస్ టి యు శాఖ సంతాపం తెలిపింది. మామిడికుదురు మెయిన్ స్కూల్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు కారుపల్లి కళ్యాణ్ బాబు, ప్రధాన కార్యదర్శి కొమ్ముల వీర రాఘవ రావు, రాష్ట్ర కౌన్సిలర్ మట్టా నాగరాజు, సిపిఎస్ కన్వీనర్ నేల వెంకటేశ్వరరావు, జల్లి కోటేశ్వరరావు, తదితర సభ్యులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం :** టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ అధ్యక్షతన మాజీ జెడ్‌పిటిసి సభ్యులు, రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ తదితరులు రామోజీరావు మృతికి సంతాపం తెలిపారు. వానపల్లిపాలెం సర్పంచ్ నల్లా బాపండి, తెలుగు రైతు మండల అధ్యక్షుడు పెమ్మిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. గోపవరంలో మాజీ ఎంపీ ఎజెవి బుచ్చి మహేశ్వరరావు (బుచ్చిబాబు) ఇంటి వద్ద రామోజీరావు చిత్రపటానికి బుచ్చిబాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. **ఆత్రేయపురం:** రామోజీరావు మరణం తెలుగు ప్రజలకు తీరని లోటని సినీ హీరో రామ్‌చరణ్ అన్నారు. బొబ్బర్లంక ధనలక్ష్మి దేవత గుడి సమీపంలో శనివారం గేమ్ ఛేంజర్ మూవీ చిత్రీకరణ జరిగింది. రామ్ చరణ్ నటిస్తున్న చిత్రానికి సంబంధించి పలు సన్నివేశాలను చిత్రీకరించారు. అనంతరం రామ్‌చరణ్, దర్శకుడు శంకర్, నటులు సునీల్, రఘు కారుమంచి ఇతర చిత్ర బృంద సభ్యులు ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మృతికి సంతాపంగా రెండు నిమిషాల పాటు నివాళులు అర్పించారు.

మంగళగిరిలో రామోజీ చిత్రపటం వద్ద సుబ్బరాజుతదితరుల నివాళి

నేడు టిడిపి విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

టిడిపి విజయోత్సవ ర్యాలీని ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు నిర్వహిస్తామని ఆ పార్టీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇక్కడ ఎంఎల్ఎ అభ్యర్థిగా విజయం సాధించిన వాసంశెట్టి సుభాష్ ఈ ర్యాలీలో పాల్గొంటారని, గెలిచిన తర్వాత నియోజకవర్గానికి వస్తున్న సుభాష్‌కు కార్యకర్తలు అభిమానులు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధంగా ఉండాలని నాయకులు కోరారు. గొల్లపాలెం సెంటర్లో గల ధనమ్మ గుడి వద్ద నుంచి ర్యాలీ ద్రాక్షారామం మీదుగా రామచంద్రపురం చేరుకుంటుందని, ర్యాలీని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్టూ'నిజం'



ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడమే 'శాంతి నికేతన్' లక్ష్యం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మండలంలోని మురమళ్ల లో 24ఏళ్ల క్రితం స్థాపించిన శాంతి నికేతన్ ప్రయిమరీ హైస్కూల్ నాణ్యమైన విద్యకు చిరునామాగా మారిందని పాఠశాల కరస్పాండెంట్ గోకవరపు వెంకటరాజు, ప్రిన్సిపల్ జి.వీరభద్ర కుమారి 'ప్రజాశక్తి'కి తెలిపారు. 2001లో ప్రారంభించినప్పటి నుంచి ఒకే యాజమాన్యంతో 150 మంది విద్యార్థులతో నిర్వహించబడుతూ వ్యవస్థాపకులే అధ్యాపకులుగా పిల్లల అభివృద్ధే ధ్యేయంగా నేడు 1000 మందికి పైగా విద్యార్థులతో సువిశాలమైన తరగతి గదులు కలిగిన సొంత భవనంలోకి మారేస్థితికి ఎదిగిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పటిష్టమైన ప్రణాళికను అనుసరిస్తూ ప్రతి విద్యార్థిపైనా ప్రత్యేక శ్రద్ధ కనబరిచి విద్యా బోధన అందిస్తున్నామని తెలిపారు. మేము అతి తక్కువ ఫీజులతో ప్రాథమిక స్థాయి నుంచి చిన్నారులకు అన్ని కాంపిటేటివ్ పరీక్షలకు ఉపయోగపడేలా క్వాలిటీ విద్యనందిస్తున్నామని అన్నారు. 2024 టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో 36 మంది విద్యార్థులు హాజరుకాగా 30మంది 500 కు పైగా మార్కులు సాధించారన్నారు. ఎస్.అనూష 578/600,ఎన్.హాసిని 578, జి.డి.హాసిని 569, జి.శరణ్య 568 మార్కులు సాధించారన్నారు.

శాంతి నికేతన్ ప్రయిమరీ హైస్కూల్

వివిధ వేషధారణల్లో విద్యార్థినులు

ప్రత్యేకతలు

1. విద్యార్థుల చేతి రాత పై ప్రత్యేక శ్రద్ధ
2. స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్ పై ప్రత్యేక శ్రద్ధ
3. క్రమ శిక్షణతో కూడిన ఒత్తిడి లేని విద్య.
4. విశాలమైన తరగతి గదులు.
5. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధన.
6. విశాలమైన ఆట స్థలం.
7. ప్రతి విద్యార్థిపైనా వ్యక్తిగత శ్రద్ధ.
8. చదువులో వెనుకబడినవిద్యార్థులకుప్రత్యేక సెక్షన్లు.
9. ఐపిఎం:(ఎడ్యుకేషన్ ప్రొఫైల్-2)

దాతకు స్వామి వారి చిత్రపటం అందజేత

నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శనివారం దాత విరాళం అందజేశారు. వైవి.లంక బాడవ, యల మంచిలికి చెందిన పాతబల్ల సూర్యనారాయణ, సుధారాణి దంపతులు, మెరుమ్ రవి తేజ, సత్య పూర్ణిమ దంపుతుల పెళ్లి రోజు ప్రతి ఏటా ఏప్రిల్-3 న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,000 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. దాత దంపతులకు ఆమె స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదాలు అందజేశారు. శనివారం ఆలయానికి రూ.4,18,282 ఆదాయం వచ్చిందన్నారు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు.

నేరాలు ఘోరాలు

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - జగ్గంపేట

మండలంలోని గుర్రప్పాలెం గ్రామంలో బాలాజీ రైస్ మిల్లులో ఒక వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానిక ఎస్ఐ నాగర్జునరాజు తెలిపారు. మిల్లులో మరమ్మతు పనులు నిమిత్తం రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన పోలిశెట్టి వీర వెంకట సత్యనారాయణ (50) కొంతమందితో కలిసి పెయింటింగ్ పనులు చేస్తున్నాడు. పెయింటింగ్ తోపాటు వెల్డింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో శుక్రవారం వీర వెంకట సత్యనారాయణ పెయింటింగ్ పనులు చేస్తూ నిచ్చెనను అటూ ఇటూ తిప్పే క్రమంలో ప్రమాదవశాత్తు వెల్డింగ్ పనులు చేస్తున్న విద్యుత్ వైరుకు నిచ్చెన తగలడంతో విద్యుత్ షాక్ గురై వీర వెంకట సత్యనారాయణ అక్కడికక్కడే మతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతుడు కుమారుడు పోలిశెట్టి సత్య దుర్గా ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

10 కాసుల బంగారు ఆభరణాలు రూ.2 లక్షల నగదు చోరీ

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక ప్లీడర్ల వీధిలో తాళాలు వేసిన ఇంటిలోకి చొరబడి 10 కాసుల బంగారు ఆభరణాలు, రూ.2 లక్షల నగదు దొంగలు చోరీ చేశారు. ప్లీడర్ల వీధికి చెందిన నామ సతీష్ తన ఇంటికి తాళాలు వేసి ఇతర ఊరులో ఉన్న బంధువుల ఇంటికి వెళ్లి శనివారం ఉదయం ఇంటికి రాగా ఇంటికి వేసిన తాళాలు బద్దలు కొట్టి ఉన్నాయి. ఇంటిలోకి వెళ్లి చూడగా బంగారు ఆభరణాలు, నగదు చోరీ జరిగినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా సిఐ రవికుమార్, బి.సురేష్‌లు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీమ్స్‌ను రప్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్ఇబి దాడుల్లో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి - గోపాలపురం

మండలంలోని సాగిపాడులో శనివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఇబి సిఐ కెవి స్వామి తెలిపారు. ఈ దాడుల్లో 8 మద్యం సీసాలతో ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ పి.సుధీర్ సిబ్బంది ఉన్నారు.

పిడిఎఫ్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి-చాగల్లు

ధారవరంలో చీదెళ్ళ సాంబశివరావు ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పిడిఎస్ రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డిప్యూటీ తహశీల్దార్ ఎం.సునీత ఇంటిలో తనిఖీ చేయగా సుమారు రూ.1,80,000 విలువైన 4500 కేజీల ప్రజా పంపిణీ బియ్యాన్ని సీజ్ చేశారు. సివిల్ సప్లయీస్ డిప్యూటీ తహశీల్దారు మామూడూరి సునీత ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు.

రెండు గ్రూపుల ఘర్షణ పలువురికి గాయాలు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొండవరం గ్రామం శివారు కాశి వారి పాకల్లో శనివారం రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో ఒక గ్రూపునకు చెందిన నలుగురికి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గుడిని శుభ్రం చేసేందుకు ఒక మహిళ వెళ్ళగా గుడిలో ఉన్న ఫ్యాన్, టీవీని ఆఫ్ చేయాలని అక్కడ కూర్చున్న యువకులకు ఆమె తెలిపింది. ఫ్యాను ఆపేది లేదని మహిళను దుర్భసలాడి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు ఆమె తెలపడంతో వారు అక్కడికి వచ్చి యువకులను ప్రశ్నించారు. రెండు గ్రూపుల మధ్య ఘర్షణ ఏర్పడడంతో రాయుడు వెంకటరమణ, పిల్లి లోవరాజు, వాసంశెట్టి శ్రీను, రాయుడు అప్పా రావుకు తలకి గాయాలయ్యాయి. వీరిని పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

కిక్కిరిసిన వెంకన్న ఆలయం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయం శనివారం యాత్రికులతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది తెల్లవారుజామున మూడు గంటల నుండి యాత్రికుల తాకిడి మొదలై రాత్రి 10 గంటల వరకు కొనసాగింది. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ డిప్యూటీ కమిషనర్ భూపతి రాజు కిషోర్ కుమార్ అన్ని ఏర్పాట్లును చేసి పర్యవేక్షించారు వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ భారీ స్థాయిలో అన్నదాన నిర్వహించారు. ప్రదక్షిణ చేసే యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్లు ఆలయ డిసి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిసి కెమెరా పర్యవేక్షణలో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు స్వామివారికి వివిధ సేవలు అన్నదాన విరాళం, లడ్డు విక్రయం తదితరాల వలన రూ.36 లక్షలు ఆదాయం సమకూరిందని ఆలయ డిసి తెలిపారు.

లీలా కృష్ణకు అభినందనలు

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండపేట ఎంఎల్ఎ వేగుళ్ళ జోగేశ్వరరావు విజయానికి కృషి చేసిన జనసేన పార్టీ ఇన్ చార్జి వేగుళ్ల లీలా కృష్ణకు శనివారం పలువురు నాయకులు అభినందనలు తెలిపారు. ఆయన స్వగహమైన కపిలేశ్వరపురం మండలం వల్లూరులో ఆయన స్వగహానికి వెళ్లిన ఆటో యూనియన్ నాయకులు, లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు లీలా కృష్ణను సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఏ సమస్య వచ్చినా తాను ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు.

ఎంఎల్ఎ 'గిడ్డి'కి సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

పి.గన్నవరం నియోజకవర్గం ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణని కలిసి వినూత్నంగా కొబ్బరి పీచుతో తయారుచేసిన మాల తో సత్కరించి శనివారం బిజెపి యువత శుభాకాంక్షలు తెలిపారు. యువ మోర్చా నాయకులు కటికిరెడ్డి గంగాధరం, శివ సాయి, అరిగిల వెంకటేష్, సాయి సూర్య, ఏడిద రామా మోహన్ రావు, పండు తదితర యువకులు మర్యాద పూర్వకంగా ఎంఎల్ఎ గిడ్డి సత్యనారాయణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాజకీయ ముఖచిత్రం తారుమారు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ఫలితాలలో వెల్లడైన ప్రజా తీర్పు రాజకీయ ముఖచిత్రం పూర్తిగా తారుమారైంది. తెలుగుదేశంపార్టీతో పాటు ఆ పార్టీ మిత్ర పక్షాలైన బిజెపి, జనసేన పార్టీల అభ్యర్థులు విజయఢంకా మోగించిన విషయం విదితమే. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా టిడిపి 2014లో ఘన విజయం సాదించింది. తాజాగా 2024లోనూ అవే ఫలితాలు పునరావృతం అయ్యాయి. ఈ నేపథ్యంలో టిడిపి కూటమి శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. మరోవైపు గెలుపొందిన అభ్యర్థులు తమకు అమాత్యులుగా అవకాశం లభిస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే ఈ అవకాశం ఎవరికి లభిస్తుందో తెలియాలంటే కొంతకాలం వేచి చూడాల్సిందే. తాజా ఫలితాల నేపథ్యంలో వైసిపి శ్రేణులను నిరాశను మిగిల్చింది. కౌంటింగ్ ఫలితాలు వెలువడుతుండగానే అభ్యర్థులు ముఖం చాటేశారు. కౌంటింగ్ కేంద్రాల నుంచి ఫలితాలు పూర్తిగా వెలువడక ముందే వెనుతిరగడం విమర్శలకు దారి తీసింది. సంక్షేమానికి పెద్ద పీట వేశామని అయినా తమను ప్రజలు వ్యతిరేకించడం అంతుబట్టడంలేదంటూ పలువురు వాపోయారు. ప్రజా తీర్పును గౌరవించి అధికార, ప్రతిపక్ష నేతలు మంచి పాలన అందిస్తారని ప్రజలు ఆశిస్తున్నారు.

ఆందోళన గురిచేసేలా విధ్వంస రాజకీయాలు

టిడిపి, వైసిపి ప్రతికార రాజకీయాలు పతాక స్థాయికి చేరాయి. గతంలో వైసిపి ప్రభుత్వం తెలుగుదేశం పార్టీ హయాంలో చేసిన కాంట్రాక్టర్లకు మొండి చేయి చూపించిన విషయం విధితమే. పేదలకు అందించిన టిడ్కో ఇళ్లను సైతం పంపిణీ చేయటంలో తాత్సార్యం వహించింది. ఇలాంటి ఉదాహరణలు గత ప్రభుత్వ హయాంలో అనేకం ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొంత ప్రజా వ్యతిరేకతను మూట గట్టుకుంది ఈ అనుభవాల నుంచి పాఠాలు తీసుకోవాల్సిన తేదేపా ప్రభుత్వం పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. తేదేపా గెలిచిన అనంతరం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగ ఆ పార్టీ శ్రేణులు వైసిపి ఎన్నికల గుర్తైన సీలింగ్ ఫ్యాన్‌లను రోడ్లపై ఈడ్చుకుంటూ ప్రదర్శనలు చేసి వైసిపి కార్యకర్తలను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. రాజమహేంద్రవరంలో తేదేపా శ్రేణులు మరో అడుగు ముందుకేశారు. మోరంపూడి జంక్షన్ వద్ద నిర్మించిన ఫ్లై ఓవర్ కోసం నిర్మించిన శిలా ఫలకాన్ని ధ్వంసం చేశారు. సిటి ఎంఎల్ఎ ఆదిరెడ్డి వాసు సమక్షంలోనే ఇటువంటి దుశ్చర్య జరగటం, అనంతరం కార్యకర్తలను ఎంఎల్ఎ సమర్థించటం విమర్శలకు దారి తీసింది. ప్రజలకు సుపరిపాలన అందించాల్సిన నేతలు భిన్నంగా ప్రతికారేచ్ఛతో ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయటం ప్రజలను, ప్రజాస్వామ్య వాదులను ఆందోళనకు గురి చేస్తోంది.

ప్రయివేటు కళాశాలల్లో జోరుగా అడ్మిషన్లు

జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ కళాశాలల అడ్మిషన్లు జోరు ఈ వారం మరింత పెరిగింది. విజయవాడ, విశాఖ, పట్నం, హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న కొన్ని కార్పొరేట్ కళాశాలల నుంచి పీఆర్‌వోల పేరుతో ప్రతినిధులు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రవేశాలకు ఆహ్వానం పలికారు. విద్యార్థుల వివరాలు, ఫోన్ నంబర్లు, చిరునామాలు సేకరించి కళాశాలలకు రావాలని కోరారు కొన్ని కళాశాలల యాజమాన్యాలు ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందించి, ఫీజు రాయితీలు కూడా ఇస్తామని హామీలు గుప్పించి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అడ్వాన్సుల రూపంలో కొంత మొత్తం నగదు కట్టించుకొని సీటు రిజర్వు చేయిస్తున్నట్టు సమాచారం. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తమ ఫలితాలు వెలువడిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలకు పంపిస్తారనే ఆశాభావం అధ్యాపకులలో వ్యక్తవముతోంది. .

వార్డెన్లకు.. అప్పుల తిప్పలు

జిల్లాలో సంక్షేమ హాస్టళ్ల వార్డెన్లు అప్పుల తిప్పలతో అవస్థలు పడుతున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభ కానున్న విషయం విధితమే. ఈ నేపథ్యంలో గత బకాయిల కోసం హాస్టల్ వార్డెన్లు ప్రభుత్వంవైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. గడిచిన ఐదేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు 150 నుంచి 200 శాతం పెరిగింది. 2018 నుంచి ఇప్పటి వరకూ నిత్యావసర సరుకుల ధరలు 150 నుంచి 200 శాతం పెరిగాయి. అప్పట్లో కందిపప్పు కిలో రూ.55 ఉండగా, ఇప్పుడు అది 160 నుంచి 185 రూపాయలు, రూ.40 ఉన్న పామాయిల్ ధర రూ.100 రూపాయలకు, రూ.80 ఉన్న చింతపండు ధర రూ.200కు, ఉప్పు ధర రూ.5 నుంచి 15కు పెరిగింది. వాటితోపాటు కాయగూరల ధరలు రెండు, మూడు రెట్లు పెరిగాయి. చికెన్ ధర రూ.180 నుంచి 280కి, కోడిగుడ్ల ధరలు రూ.6.50కి పెరిగాయి. రూ.470 ఉండే సబ్సిడీ గ్యాస్ సిలిండర్ ధర ఇప్పుడు ఏకంగా 1200 రూపాయలకు చేరింది. తాజా కొలువు దీరే ప్రభుత్వమైనా తమ గోడు పట్టించుకుంటుందనే ఆశతో వార్డెన్లు ఎదురు చూస్తున్నారు.

బీచ్ రోడ్‌లో ఆదమరిస్తే అంతే..!

- శిథిలావస్థలో వంతెనలు
- కానరాని హెచ్చరిక బోర్డులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ఉప్పాడ -కాకినాడ బీచ్ రోడ్డులో వాహన దారులు ఆదమర్చి ప్రయాణం చేస్తే ప్రాణాల కోల్పోవాల్సిందే. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి రోడ్డు ధ్వంసం కావడంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా బీచ్ రోడ్డులో ఉన్న వంతెనలు శిథిలావస్థకు చేరుకోవడంతో వాహనదారులు భయభ్రాంతులకు గురవుత ున్నారు. హెచ్చరికల బోర్డులో ఏర్పాటు చేయవలసిన అధి కారులు పట్టించుకోకపోవడంతో ప్రమాదాలు బారినపడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ద్విచక్ర వాహన దారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదకర స్థితిలో ఉప్పాడు- కాకినాడ బీచ్ రోడ్డు

ఉప్పాడ నుంచి నేమం సమీపం వరకూ బీచ్ రోడ్డు అలల తాకిడికి ధ్వంసం కావడంతో వాహనదారులు ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. రాత్రి సమ యాలలో ద్విచక్ర వాహన దారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. జిల్లా కేంద్రమైన కాకినాడకు విద్యార్థులు, ఉద్యోగస్తులు, వ్యాపారస్తులు ఈ రోడ్డుపైనే నిత్యం ప్రయాణం చేస్తారు. అలల తాకిడి ఎక్కువగా ఉన్నప్పుడు బీచ్ రోడ్డు ధ్వంసం కావటం సర్వసాధారణం. ధ్వంసం అయిన రోడ్డుకు తూతూ మంత్రంగా మరమ్మతులు చేపట్టి మామా అనిపించడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. బీచ్ రోడ్డు కాదని వేరే మార్గంలో ప్రయాణించాలంటే అదనంగా మరో 10 కిలోమీటర్లు దూరం ప్రయాణించాల్సిందే. అయితే ప్రయా ణికులు మాత్రం సమయం కలిసి వస్తుందని బీచ్ రోడ్డు మార్గాన్నే ఎన్నుకుంటారు. అద్దరిపేట నుంచి ఉప్పాడ వరకూ ఉన్న వాహనదారులు కాకినాడ చేరుకోవాలంటే బీచ్ రోడ్డు మార్గం ఒకటే ఉంది. రోడ్డు ధ్వంసం కావడంతో వారు బాధ వర్ణాతీతం. అలాగే నామం సమీపం వద్ద ఉన్న రెండు వంతెనలు, లైట్‌హౌస్ సమీపం వద్ద ఉన్న వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రమాదాల బారిన పడి ఆసుపత్రి పాలవుతున్నామని వాపోతున్నారు. కనీసం అధికారులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో కొత్తగా వచ్చే పర్యాటకులకు తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదాలకు గురికాకుండా ముందస్తుగా ఉప్పాడ కాకినాడ బీచ్ రోడ్డు మరమ్మతులు చేపట్టి ధ్వంసమైన వంతెన వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏకాగ్రత, పట్టుదల విజయానికి మెట్లు

ప్రజాశక్తి - సామర్లకోట

నవంయంపాలన, ఏకాగ్రత, పట్టుదల, లక్ష్యం విజయానికి మెట్లుగా ఉంటాయని పలువురు ప్రొఫెసర్లు అన్నారు. పట్టణంలోని వీర్రాఘవపురంలోని ఐఇఎం చర్చిలో హైస్కూల్ నుంచి పీజీ వరకూ చదువుతున్న విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక మోటివేషన్ తరగతిని శనివారం నిర్వహించారు. సంఘ కాపరి రెవ. డి ఇశ్రాయేలు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్రిస్టియన్ కౌన్సిలింగ్ ఫర్ అక్కడమిక్ ఎక్సలెన్స్ సంస్థకు చెందిన మోటివేటర్ డాక్టర్ ఉచ్చుల సత్యనందం, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సత్యనారాయణ, ఎం.ఇబ్రహీమ్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థి జీవితంలో సమయం ఎంతో విలువైనిధిగా ఉంటుందన్నారు. కొన్ని సమయాల్లో ఓటమి కలిగిందని క్రుంగిపోతే ప్రయోజనం ఉండదన్నారు. ఓటమి విజయానికి మెట్టుగా ఉంటుందే తప్ప దానిచూసి విద్యార్థులు భయపడకూడదన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేక ప్రశ్నపత్రాలు ఇచ్చి వాటినుంచి సమాధానాలు తెలుసుకుని వారి పరిజ్ఞానాన్ని అంచనా వేసి అవసరమైన సూచనలు, భవిష్యత్ విద్యా ప్రణాళిక లకు సభందించి ప్రణాళికలను వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

మోటివేషన్ తరగతిలో మాట్లాడుతున్న సత్యనందం

సుభాష్ విజయోత్సవ ర్యాలీ వాయిదా

ప్రజాశక్తి - కాజులూరు

రామచంద్రపురం నియోజవర్గ ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్ విజయోత్సవ ర్యాలీ వాయిదా పడినట్లు కూటమి నాయకులు గుబ్బల ఏసురాజు, చంద్రు వీర్రాజుచౌదరి, అన్యం శ్రీరామచంద్రమూర్తి వెల్లడించారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఆదివారం సాయంత్రం సుభాష్ విజయోత్సవ ర్యాలీని భారీగా చేయాలని నిర్ణయించామని తెలిపారు. అయితే ఈనాడు దిగ్గజం, అక్షర యోధుడు చెరుకూరి రామోజీరావు మృతి కారణంగా వాయిదా వేయడం జరిగిందని గుబ్బల ఏసురాజు మీడియాకు తెలిపారు.

ఉజ్వల భవిష్యత్‌కు కళాశాల విద్య దోహదం

ఘనంగా వ్యవసాయ కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తుకు కళాశాల విద్య ఎంతో దోహదపడుతుందని వ్యవసాయ విశ్వవిద్యాలయ డీన్ జి.కరుణాసాగర్ అన్నారు. శనివారం రాజమహేంద్రవరం (కాతేరు) వ్యవసాయకళాశాలలో వ్యవసాయ కళాశాల 16వ వార్షికోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి క్రమ శిక్షణతో విద్యను అభ్యసించడం వలన తమ ఉజ్వల భవిష్యత్తుకు కళాశాల విద్య ఎంతో దోహదపడుతుందన్నారు. ఆంధ్రా పేపర్ మిల్లు డిజిఎం ఫామ్ ఫారెస్ట్రీ డాక్టర్ బి.సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమలోని నిబిడీకృతమైన విద్యను అభ్యశించడం, తమలోని ప్రతిభా నైపుణ్యాలు ద్వారా భవిష్యత్తు ప్రణాళికకు చక్కని రూపకల్పన చేసుకోవడం ద్వారా ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చని అన్నారు. రాజమహేంద్రవరం వ్యవసాయ కళాశాల ప్రిన్సిపల్ కళాశాల ప్రగతిని వివరించారు. మార్టేరు వ్యవసాయ సంయుక్త పరిశోధన సహాయ సంచాలకులు డాక్టర్ డి.శ్రీనివాస్, ప్రొఫెసర్ హెడ్ ఆఫ్ జెనిటిక్స్ డాక్టర్ ఎస్‌వి.భవాని ప్రసాద్ మాట్లాడారు. అసిస్టెంట్ ప్రొఫిసర్ డాక్టర్ సిహెచ్. సునీత వందన సమర్పణ చేశారు.

పెరిగిన అరటి ధర

- గెల ఒకటి రూ.300,
- ఆనందం వ్యక్తంచేస్తున్న రైతులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతుకు పంట దిగుబడి బాగా వచ్చి ధర అధికంగా పలికితే రైతు సంతోషానికి అవధులు లేకుండా ఉంటాయి. ఒడిశాలోని సావిత్రి అమావాస్య పండుగతో గత వారం రోజుల నుంచి అరటి ధర బాగా పలకడంతో కౌలు రైతులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు ఆరు గెలలు రూ.1500 నుంచి రూ.1800 వరకు పలకడంతో చేసిన అప్పులు తీరుతాయని మళ్లీ పెట్టుబడి పెట్టడానికి చేతిలో డబ్బులు ఉంటాయని ప్రతి రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే జిల్లాలోని 22 మండలాల్లోని గ్రామాల పంట పొలాల్లో రైతులు 20వేల ఎకరాలలో అరటి రకం, కర్పూర, బుషావలి, సెక్రకేలి, ఎర్ర చక్రకేలి, బొంత వంటి అరటి రకాలు సాగు చేశారు.
ఇటీవల జనవరి నెల నుంచి అరటి ధర పడిపోవడంతో రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొని అప్పుల ఊబిలో కూలిపోయారు . ఈ నేపథ్యంలో ఇటీవల అల్పపీడన ప్రభావంతో సుడిగాలితో కూడిన భారీ వర్షం కురవడంతో అరటి మొక్క తోట తో పాటు ఈనిక దశలో ఉన్న వెదురువేసిన తోటలు కూడా విరిగిపోయాయి. పక్వానికి వచ్చిన అరటి గెలలు సైతం నేలకు వరగడంతో రైతుకు అపార నష్టం కలిగించింది. జిల్లాలోని సుమారు 3 వేల ఎకరాలు పై పడే అరటిపంట దెబ్బతింది. సుమారు జిల్లాలోని 40 శాతం అరటిపంట దెబ్బతినడంతో రైతులు కోలుకొని పరిస్థితి నెలకొంది. గత వారం రోజుల నుంచి అరటిపంట దిగుబడి లేక రావులపాలెం అరటి మార్కెట్‌కి అరటి రైతులు తక్కువగా తీసుకెళ్లడం ఒడిశాలో సావిత్రి అమావాస్య పండగతో ఆ రాష్ట్రానికి ఎగుమతులు చేయడంతో రైతు పంట పండింది. ఒక గల కి 200 నుండి 300 వరకు పలకడంతో రైతులు సంతోషానికి అవధులు లేకుండా పోయాయి
దీంతో కౌలు రైతులు తమ అప్పులు తీరిపోయి మళ్లీ పెట్టుబడి పెట్టడానికి చేతిలో డబ్బులు ఉంటాయని ఆనంద వ్యక్తం చేస్తున్నారు . ఆషాడ మాసం అయినప్పటికీ ముహూర్తాలు లేకపోయినా అరటి కి మంచి ధర పలకడంతో రైతులు కళ్ళల్లో సంతోషాలు కనబడుతున్నాయి.

రావులపాలెం మార్కెట్‌లో అరటి గెలలు విక్రయిస్తున్న రైతులు

కౌలు రైతుల కష్టాలు తీరుతాయి

రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని అరటి కర్పూర వేశాను . ఇటీవల వేసిన ఈదురుగాలులకు ఎకరం అరటిపంట దెబ్బతింది . అరటి లోడు 6 గెలలు 1500 నుండి 1800 వరకు పలకడంతో శిస్తు, అప్పులు తీరుతున్నాయి ధర ఇలాగే కొనసాగితే మా కౌలు రైతులకు కష్టాలు తీరుతాయి

-ఎం.సత్యనారాయణ, కౌలు రైతు, రావులపాడు

తొలకరి పంటకు సన్నద్ధమవుతున్న రైతులు

ప్రజాశక్తి -రామచంద్రపురం

రెండు రోజులుగా కురుస్తున్న తొలకరి వర్షాలకు రైతులు సేద్యానికి సమాయత్తమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటి కే ఆకుముడులకు చేలను సిద్ధం చేస్తున్నారు. రామచంద్రపురం నియోజకవర్గంలో గల రూరల్ మండలంలో 17వేల ఎకరాలు పంట సాగు అవుతుండగా, కె.గంగవరం మండలంలో 15 వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతుంది. దాల్వాలో మంచి దిగుబడులు సాధించిన రైతన్నలు తొలకరి పంట పండించేందుకు రెట్టింపు ఉత్సాహంతో సిద్ధమయ్యారు. తొలకరి కి అధిక శాతం రైతులు స్వర్ణ రకం ఎంపీలు 7029 రకం పండించేందుకు సిద్ధమవుతున్నారు. స్వర్ణ రకం అధిక దిగుబడిని ఇవ్వటమే కాకుండా వర్షాలకు తుఫాన్లకు తట్టుకోవడం నిలబడుతుంది. అందుకనే గోదావరి జిల్లాల రైతులు అధిక శాతం స్వర్ణ రకం వరి నాటేందుకు ఇష్టపడతారు. ప్రస్తుతం అవసరమైన వరి విత్తనాలు సొసైటీల వద్ద ఆర్‌బికెవద్ద సిద్ధం చేశారు. రామచంద్రపురం మండలంలోని వెల్ల వెంకటాయపాలెం, చోడవరం, జగన్నాయకులు పాలెం, ఆర్ బికెల వద్ద సిద్ధంగా ఉండగా మిగిలిన చోట్ల వ్యవసాయ సహకార సంఘాల వద్ద విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి. 30 కేజీల విత్తనాలు ప్యాకెట్ సబ్సిడీపై రూ1044 లు దర కు లభిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తెలియజేస్తున్నారు. ఈ వారంలో వర్షాలు మరింతగా కురిస్తే తొలకరి సేద్యం మరింత వేగంగా ఊపందుకుంటుంది.

విత్తనాలు సిద్ధంగా ఉన్నాయి

తొలకరి పంటకు అవసరమైన విత్తనాలు ఆర్బికేల వద్ద, సొసైటీలు వద్ద సిద్ధంగా ఉన్నాయని రామచంద్రపురం మండల వ్యవసాయ అధికారి ఎన్ .సత్య ప్రసాద్ తెలియజేశారు. ఏపీ సీడ్స్ ద్వారా అందజేస్తున్న విత్తనాలు, సన్నాలు రకం, స్వర్ణ రకం, ఆర్ జె ఎల్ రకం వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, వీటిని కిలోకు ఐదు రూపాయలు సబ్సిడీపై ఆర్బికెల్లో అందజేస్తున్నామని, అదేవిధంగా అన్ని సహకార సంఘాల్లోనూ తొలకరి విత్తనాలు 30 కేజీల బస్తాలు సిద్ధంగా ఉన్నాయని రైతన్నలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన వివరించారు.

వేగాయమ్మ పేట వద్ద ఆకుముడులకు దమ్ము చేస్తున్న రైతు

12న డాక్టర్ యనమదలకు సాహితీ సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ నగరానికి చెందిన ప్రముఖ సాంక్రమిక వ్యాధుల నిపుణులు డాక్టర్ యనమదల మురళీకృష్ణను సాహితీ సత్కారంతో గౌరవించనున్నట్టు చిత్తూరుకు చెందిన ప్రసిద్ధ కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. 12వ తేదీన చిత్తూరు రాజమహల్‌లో జరగనున్న కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపికైన నవలా రచయితలు ఎ.మునిసురేష్‌పిళ్ళయ్, కాశీపురం ప్రభాకర్ రెడ్డి, కథానిక సంపుట రచయితలు రోహిణి వంజారి, డాక్టర్ ఎం.సుగుణరావులతో పాటు, వైద్య విజ్ఞాన రచనలతో గతంలో ఎయిడ్స్ సందర్భంలోనూ, ప్రస్తుతం కోవిడ్ విషయమై తెలుగు ప్రజలకు అవగాహన, భరోసాలను ఇచ్చిన డాక్టర్ యనమదల మురళీకృష్ణను సత్కరించ నున్నట్టు కుప్పం రెడ్డమ్మ సాహితీ అవార్డు ట్రస్ట్ అధ్యక్షురాలు డాక్టర్ పి.రోజాప్రియ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సి.నిరంజన్ రెడ్డి, వ్యవస్థాపకులు డాక్టర్ కె.రామలక్ష్మి తెలిపారు. డాక్టర్ కె.రామలక్ష్మి తన తల్లి కుప్పం రెడ్డమ్మ స్మృతికి నివాళిగా ప్రతి ఏటా శ్రీరామనవమికి కవులను రచయితలను సత్కరిస్తారు. కుప్పం రెడ్డమ్మ పుట్టినరోజు అయిన జూన్ 12న తెలుగు రాష్ట్రాలలో రచనలతో విశేష ప్రభావం చూపిన కవి, రచయితలను ఘనంగా సత్కరిస్తారు. కుప్పం రెడ్డమ్మ సాహితీ సత్కారానికి ఎంపికైన డాక్టర్ మురళీకృష్ణ గతంలో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ తోపాటు పలు సంస్థల నుంచి విశిష్ట గౌరవాలను పొందారు.

వైద్యం వికటించి బాలుడు మృతి ఆలస్యంగా వెలుగు చూసిన వైనం

ప్రజాశక్తి-యు.కొత్తపల్లి

ఒక వైద్యుడు చేసిన చికిత్స వికటించి ఒక బాలుని ప్రాణం బలైపోయింది. ఈ సంఘటన యు.కొత్తపల్లి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోనపాపపేటకు చెందిన సూరాడ ప్రదీప్ (14) 9వ తరగతి చదువుతున్నాడు. వారం క్రితం కడుపునొప్పి, జ్వరం ఉందని ఉప్పాడలోని శాంతి హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. ఆసుపత్రిలో వైద్యుడు గోపాలకృష్ణ ఇంజిక్షన్లు చేసి, టాబ్లెట్లు ఇచ్చి వేసుకోమని పంపించారు. టాబ్లెట్లు వేసుకున్న మరుక్షణం మందులు వికటించడంతో బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. దీంతో మృతి చెందిన బాలుడు తల్లిదండ్రులు వైద్యుడిని నిలదీయడంతో నష్టపరిహారం ఇస్తానని చెప్పినట్టు తెలుస్తోంది. శాంతి హాస్పిటల్ వైద్యుని సంప్రదించేందుకు ప్రయత్నించడగా వారం రోజుల నుంచి రావడం లేదని తెలిసింది. అనుమతులు లేని ఇలాంటి క్లినిక్‌లపై అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్ర పురోభివృద్ధి

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రత్యేక హోదా సాధించటం ద్వారానే రాష్ట్రం అన్ని రంగాలలోనూ పురోభివృద్ధి సాధిస్తుందని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు అన్నారు. శనివారం మండలంలోని పులిమేరు గ్రామంలో రైతు కూలీ సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభజన వల్ల నష్టపోయిన రాష్ట్రం ప్రత్యేక హోదాతోనే అభివృద్ధి చెందుతుందన్నారు. అత్యధిక మెజార్టీతో గెలుపొంది కేంద్రంలో కీలక పాత్ర పోషించనున్న టిడిపి అధినేత చంద్రబాబు ప్రత్యేక హోదా కోసం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు వల్లూరి రాజబాబు, కడితి సతీష్, కుంచే అంజిబాబు, దేశెట్టి సురేష్, నారాయణరావు పాల్గొన్నారు.

BEFORE THE HONOURABLE DEPUTY REGISTRAR OF CHITS
(O/o DISTRICT REGISTRAR OF REGISTRATION OF CHITS)
AT GUNTUR, GUNTUR DISTRICT
ARBITRATION CLAIM PETITION NO. 68/2022

BETWEEN:
M/s. SHRIRAM CHITS (P) LTD., Guntur-II Branch Rep by its Senior Manager/G.P.A.Holder ... Disputant.

VERSUS

Konala Siva Prasad Reddy and others ...Opponents

1. Konala Siva Prasad Reddy, S/o Bapi Reddy, Hindu, aged 33 years, Business and R/o D.No.7-308, Sivalayam street, Anaparthi, East Godavari(DT), ...Opponents.

Whereas the above named disputant has instituted a claim for recovery of Rs. 58,618/- against you are hereby Summoned/ Notice to appear in this Tribunal (Deputy Registrar of Chits) in person on the 11-06-2024 at O/o District Registrar, Guntur 10.30 A.M. in the forenoon, to answer the claim; and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defense.

Take notice that, in default of your appearance on the day before mentioned, the claim will be heard and determined in your absence.

Given under my hand and seal of the Court, this 30-04-2024
DEPUTY REGISTRAR OF CHITS, Arbitrator, Guntur

IN THE COURT OF THE 1st ADDITIONAL DISTRICT JUDGE, ELURU

I.A.NO.3/2023 IN **OS.NO.55/2014**

Between:
Kothapalli Venkata Narasimha Raju ***...PETITIONER/ (3rd DEFENDANT)***

Vs

Vardhineedi Basavaraju & others ***...RESPONDENTS***

NOTICE

2. Vardhineedi Basavaraju, Son of Satyanarayana, Cultivation, D.No.1-15, Dubbacherla Village. Nallajerla Mandal. WGDT. TJCJ. ***...(1st Defendant)***

Whereas the petitioner filed a petition to condone the delay of 407 days for filing the petition to set-aside the ex-parte petition. The Honourable court order notice in the above petition to the 2nd respondent (1st Defendant).

Whereas as the notice addressed to the 2nd respondent (1st Defendant) in the above petition could not be served as last known address and the notice could not be served;

Whereas the Honorable court ordered notice to 2nd respondent (1st Defendant) by substituted service by way of publication;

You, are hereby called upon to appear in person before this Honourable court Eluru **on 03-07-2024 at 10.30 A.M.** and state your objections if any. Lest the petition will be decided exparte.

(As per court orders)

DEVULAPALLI SREE RAM
DEVULAPALLI KRISHNA SASTRY

Eluru, Dt.23-05-2024 — Advocates Eluru